క్లుప్తంగా

నేడు తడ్కపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు

సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం తెలిపారు. పేదరిక నిర్మూలన పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం అనే అంశంపై చట్టపరమైన అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

చదువుతోనే గుర్తింపు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే గుర్తింపు లభిస్తుందని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలన, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసుకుని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

హుస్నాబాద్: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ఈనెల 6న దరఖాస్తు గడువు ముగియనుంది. మున్సిపల్ కార్యాలయం నుంచి 13 మంది ఆపరేటర్లకు దరఖాస్తులను ఎలా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలో సిద్దిపేటలో శిక్షణ ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. ఈనెల 4వ తేదీ వరకు 5,962 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు.

బ్లడ్ కేన్సర్‌ను నయం చేయొచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్ జైషేత్వార్

సిద్దిపేటకమాన్: బ్లడ్ కేన్సర్ లాంటి వ్యాధులను పూర్తిగా నయం చేయవచ్చని హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ గణేష్ జైషేత్వార్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బ్లడ్ కేన్సర్‌ను జయించిన బాలకృష్ణతో కలిసి మాట్లాడారు. జిల్లాకు చెందిన బాలకృష్ణ (62) ఆరేళ్ల క్రితం బోన్ కేన్సర్ బారిన పడినట్లు తెలిపారు. అతడికి అత్యాధునిక చికిత్స ద్వారా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చేయడం ద్వారా తిరిగి కోలుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. బ్లడ్ కేన్సర్‌ను ముందుగా గుర్తించడం వల్ల పూర్తిగా నయమయ్యే అవకాశాలను గణనీయంగా మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో తుమ్మలపల్లి మహేష్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్క్ స్థలాల పరిశీలన



పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

హుస్నాబాద్: పట్టణంలోని పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేయబోయే పార్క్ స్థలాలను గురువారం హైదరాబాద్ ఎన్‌సీపీఈ ఏజెన్సీ నిర్వాహకులు పరిశీలించారు. పట్టణంలోని డీఆర్‌సీ సెంటర్, నేతాజీ కాలనీ, మిని స్టేడియం పక్కనే ఏర్పాటు చేయబోయే పార్క్ స్థలాలను వారు సందర్శించారు. వీరి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్ కొంకట నళినిదేవి, అసిస్టెంట్ ఇంజనీర్ సాయి ప్రణీత్ ఉన్నారు.

ఆర్థికసాయం

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని హైమద్‌నగర్‌కు చెందిన షేక్ షాహిద్ ఇటీవల రోడ్డు ప్రమాదంతో మృతి చెందాడు. శుక్రవారం జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు మండల కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవేందర్ బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు.

ఫంగస్ చేప @10 కిలోలు



చిన్నకోడూరు మండల పరిధిలోని చంద్లాపూర్ శివారు రంగనాయక సాగర్‌లో శుక్రవారం మత్స్యకారులు చేపలు పడుతుండగా పది కిలోల ఫంగస్ చేప చిక్కింది. రిజర్వాయర్‌లో ప్రభుత్వం రవులు, మెరిగ, కట్ల చేప పిల్లలను వదిలారు. కాగా ఫంగస్ చేప పడడంపై మత్స్యకారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

ఫంగస్ చేపతో మత్స్యకారుడు

ఆకట్టుకున్న గ్రీన్ డే..



గజ్వేల్ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం గ్రీన్ డే ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ హారిణ మాట్లాడుతూ విద్యార్థులు తీసుకొచ్చిన ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలతో అంగడిని ఏర్పాటు చేసి క్రయవిక్రయాలు జరిపినట్లు పేర్కొన్నారు. దీని ద్వారా రైతుల కష్టసుఖాలు వివరించే ప్రయత్నం చేశామని తెలిపారు.

– గజ్వేల్‌రూరల్

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోండి



అక్కన్నపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



కొక్కొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి

జిల్లా బీసీ సంక్షేమ అధికారి సరోజ

అక్కన్నపేట(హుస్నాబాద్)/ములుగు(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి సరోజ అన్నారు. మండలంలోని కుందనవానిపల్లి, మైసమ్మవాగుతండా, రేగొండ, మల్‌చెర్వుతండాలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ ఐదు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

- ములుగు మండలంలోని కొక్కొండ, తున్కిబొల్లారం గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన నిర్వహించారు. తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి రెండు బృందాలుగా ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.
- చిన్నకోడూరుమండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సిద్దిపేట ఆర్డీఓ రమేష్ బాబు సందర్శించి ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీఓ సామిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు

హుస్నాబాద్: సురక్షిత ప్రయాణం ఆర్టీసీ బస్సుల్లోనే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం బస్టాండ్ ఆవరణలో హుస్నాబాద్ డిపోకు కొత్తగా కేటాయించిన ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రస్తుత ఎక్స్‌ప్రెస్ బస్సు కాకుండా మరో రెండు ఎక్స్‌ప్రెస్‌లు మరో వారం రోజుల్లో రానున్నాయని తెలిపారు. వీటితో పాటు త్వరలోనే మరో 8 కొత్త బస్సులు డిపోకు రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, కోమటి స్వర్ణలత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు



చౌటపల్లిలో భక్తుల శోభాయాత్ర

వర్గల్(గజ్వేల్)/అక్కన్నపేట(హుస్నాబాద్)/బెజ్జంకి(సిద్దిపేట): అయోధ్య రామతీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వర్గల్ మండలం నాచారంలో అక్షింతలు పంపిణీ చేశారు. అయ్యప్ప ఆలయం నుంచి భక్తజనులు ఊరేగింపుగా అక్షింతలు తీసుకొచ్చారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, సర్పంచ్ గద్దల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి మండలంలోని బెజ్జంకి, గాగిల్లాపూర్‌లో అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జాలిగామలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మీసాల నరేష్ (30) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తమ వ్యవసాయ భూమి వద్ద గురువారం గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

దుబ్బాకటౌన్: తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడంతో పాటు పద్మశాలి సంఘం బలోపేతం కోసం కృషి చేసిన కొండా బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర మల్లేశం అన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటలో బాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల తిరుపతి, జిల్లా కార్యదర్శి శ్రీరాం రామకృష్ణ ప్రభు, బడుగు రాజు, ఆస రవి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

వర్గల్(గజ్వేల్): పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని శుక్రవారం వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్ బాధితుడికి అందజేశారు. తున్కిఖాల్సా సమీప సీతారామ స్పిన్నింగ్ మిల్‌కు చెందిన అజితసింగ్ సెల్‌ఫోన్ నాలుగు రోజుల క్రితం పోయింది. బాధితుడు గౌరారం పోలీసులను ఆశ్రయించాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పరిశోధన జరిపి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గౌరారం పీఎస్‌లో బాధితుడికి అందజేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నట్లయితే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. బిల్లులు లేకుండా సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనొద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు తీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న సర్దార్‌ఖాన్

గజ్వేల్‌రూరల్: అధికారం కోల్పోగానే బీఆర్‌ఎస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ విమర్శించారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. మాయమాటలతో మోసం చేస్తూ పదేళ్లపాటు పాలన సాగించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికైనా ఆపార్టీ నాయకులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఎంపీ ఎన్నికల్లో సైతం ప్రజలు బీఆర్‌ఎస్‌కు మరోసారి బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అజ్గర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

దుబ్బాక: అపరిచిత వ్యక్తుల మోసపూరిత కాల్స్‌కు ఎవరూ స్పందించొద్దని దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న యాదగిరికి ఇటీవల గుర్తు తెలియని నంబర్‌తో ఏసీబీ బ్యూరో నుంచి పలు ఆరోపణలు ఉన్నట్లు సైబర్ నేరగాడి నుంచి బెదిరింపు కాల్ వచ్చినట్లు తెలిపారు. తాము రైడ్ చేయకుండా ఉండాలంటే తమ అకౌంట్ నంబర్‌కు రూ. 2 లక్షలు పంపించాలని సదరు వ్యక్తి ఫోన్ ద్వారా బెదిరించాడు. మాయమాటలకు బెదిరిపోయిన బాధితుడు సైబర్ నేరగాడి ఖాతాకు రూ. 50 వేలు పంపించాడు. మరోసారి బెదిరింపు కాల్ రావడంతో ఆన్‌లైన్ మోసమని గ్రహించిన బాధితుడు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొగుట(దుబ్బాక): ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సల్మాజాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ విద్యార్థులు ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనాథ చిన్నారులకు 'భరోసా'



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు భరోసా ఫౌండేషన్ అండగా నిలిచింది. మండల పరిధిలోని కొల్గూరుకు చెందిన నీరుడి భాస్కర్ ఏడాది క్రితం మృతి చెందగా.. అతడి భార్య కవిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గజ్వేల్‌కు చెందిన భరోసా ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం అనాథ చిన్నారులకు రూ. 25 వేల ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రాజు, నరేష్, భాస్కర్, అంజనేయులు, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆటవిడుపు



వాలీబాల్ ఆడుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఆర్టీసీ డిపోలో శుక్రవారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కా ర్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ జోష్ణ హాజరై మాట్లాడారు. ఉద్యోగుల మానసికోల్లాసం కోసం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

వర్గల్(గజ్వేల్): నూతన సంవత్సరం టీపీటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను శుక్రవారం వర్గల్ మండలం వేలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కనకరాజు, టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం నర్సయ్య, పిల్లి రాములు ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సొసైటీని ఆదర్శంగా నిలుపుతా**

తొగుట(దుబ్బాక): రైతుల సహకారంతో సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు పంటరుణాలు అందిస్తూ అండగా నిలుస్తున్నామని పేర్కొనారు. రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు 80 శాతం రికవరీ చేశామన్నారు. ఈ సీజన్‌లో రైతులకు రూ. 44 లక్షల పంట రుణాలు అందించామన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, సీఈవో గంగారెడ్డి పాల్గొన్నారు.

◆ **నూతన నియామకం**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ ముస్లిం అధ్యక్షుడిగా ఎం.ఏ.ముఖీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మసీదులో జరిగిన ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఎండీ. ఇజాజ్ అహ్మద్, సెక్రటరీగా ఎండీ.రఫీక్ అహ్మద్ (ఆదిల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

◆ **ఆర్థిక సహాయం**



చేర్యాల(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న మండల పరిధిలోని వీరన్నపేటకు చెందిన బింగి చంద్రం కుటుంబానికి శుక్రవారం పలువురు రూ.3.20 లక్షల ఆర్థిక సహాయం అందించారు. హైదరాబాద్ శేరిలింగంపల్లి మండల కురుమ సంఘం, పాపిరెడ్డి కాలనీ కురుమ సంఘం సంయుక్తంగా రూ. 1.20 లక్షలు, వీరన్నపేట గ్రామస్తులు, మిత్రులు సర్పంచ్ కొండపాక భిక్షపతి ద్వారా అందించిన మొత్తం రూ.1.10 లక్షలు, కౌసర్, జహంగీర్, పోలీసు లైన్ బృందం రూ. 50 వేలు, మృతుడి క్లాస్‌మేట్స్ రూ. 40 వేలు మొత్తం కలిపి రూ. 3.20 లక్షలు మృతుడి ఇద్దరు పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

◆ **పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ**

దౌల్తాబాద్(దుబ్బాక): జెడ్పీటీసీ రణంజ్యోతి శ్రీనివాస్‌గౌడ్ పెళ్లి రోజు సందర్భంగా శుక్రవారం మండల బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంబగ యాదగిరి సొంత డబ్బులతో మండల పరిధిలోని ఇందుప్రియాల్‌లో ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల కుమార్, ఎంపీటీసీ వీరమ్మ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. అలాగే మల్లేశంపల్లి బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శివంది భాస్కర్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు.

◆ **దుప్పట్ల పంపిణీ**



గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని జాలిగామలో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ అధ్యక్షుడు పండరి మాట్లాడుతూ.. నిరుపేదలకు అండగా నిలుస్తూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు హరికృష్ణ, హరిశంకర్, శ్రీనివాస్, శ్రీధర్‌గుప్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటకు చెందిన బెజ్జంకి మాజీ ఎంపీపీ గుండ ఎల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. అనంతరం లక్ష్మీపూర్‌కు చెందిన పల్లె సుజాత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ సంజీవరెడ్డి, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధితులను ఆదుకోండి**



జగదేవ్‌పూర్(గజ్వేల్): రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందిన తిగుల్ గ్రామ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం సర్పంచ్ భానుప్రకాశ్‌రావు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. కలెక్టర్‌తో మాట్లాడి పారిశుధ్య కార్మికులకు నష్ట పరిహారం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.